ఆలయాలకు శివరాత్రి శోభ



నీలమ్మవేపచెట్టు అమ్మవారు

- ముస్తాబవుతున్న దేవాలయాలు
- 8న నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఉత్సవం
- 9న దుర్గాలమ్మ వేడుక

శివరాత్రి ఉత్సవాలకు నియోజకవర్గంలోని ఆలయాలన్నీ కనుల పండువగా ముస్తాబవుతున్నాయి. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం, పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయం, అచ్చియ్యమ్మపేటలోని చిన దుర్గాలమ్మ ఆలయాలు పండగ శోభ సంతరించుకున్నాయి. వేడుకల సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అగ్నిగుండం తొక్కే కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



అచ్చియ్యమ్మపేట చిన దుర్గాలమ్మ అమ్మవారు

అల్లిపురం : నియోజకవర్గంలో శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ మేరకు ఇప్పటికే సంబంధిత దేవాలయ కమిటీలు, అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు. భక్తులు కూడా ఎవరికి వారు అమ్మవార్ల ఘటాలు తీసుకువచ్చి పూజలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు మాలలు ధరించి ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు.

8న నీలమ్మ వేపచెట్టు అమ్మవారి జాతర..

అస్సాంగార్డెన్స్‌లో గల శ్రీ నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో మహాశివరాత్రి వార్షిక జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ బోరా విజయలక్ష్మి తెలిపారు. 7వ తేదీ శుక్రవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం కుంకుమ పూజలు చేస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవారి మాలధారులు అగ్నిగుండ ప్రవేశం చేయనున్నారు. 8వ తేదీన ప్రధాన జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమ పూజల అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం దర్శనాలు కల్పించనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవాలయం

9న దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక జాతర..

పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన అమ్మవారి తొలేళ్ల ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున 5 గంటల నుంచి అమ్మవారికి కుంకుమార్చనలు, శూలాల పండగ, భక్తుల అగ్నిగుండం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం అనంతరం తొలిపూజ అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 9వ తేదీన అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 3 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ఉంటాయి. భక్తులు ఘటాలతో వచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు.



పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ అమ్మవారు

అచ్చియ్యమ్మపేట చినదుర్గాలమ్మ ఉత్సవం..

అచ్చియ్యమ్మపేటలో గల చినదుర్గాలమ్మ అమ్మవారి వార్షిక శివరాత్రి ఉత్సవం 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 8న తొలేళ్ల ఉత్సవంలో భాగంగా తిరువీధి ఉత్సవం, అగ్నిగుండం ఉంటుందని తెలిపారు.

అపూర్వ స్వాగతం







విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, పార్టీ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

క్లుప్తంగా

సౌభాగ్యలక్ష్మిగా దుర్గాలమ్మ



గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ అమ్మవారు

దాబాగార్డెన్స్ : పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం సౌభాగ్య లక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని రకరకాల రంగులతో కూడిన గాజులతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నేడు దీపాలంకరణ.. : వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో దీపాలంకరణ చేపట్టనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం తొలేళ్ల ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. 8న మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, ఉదయం 5 గంటల నుంచి కుంకుమార్చనలు, దర్శనాలు, అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ అత్యంత వైభవంగా జరపనున్నారు. 9న అమ్మవారి జాతర మహోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. భక్తులు ఘటాలతో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించనున్నారు. 16వ తేదీ మారువారాన్ని పురస్కరించుకుని అష్టోత్తర శత పదార్థ నివేదన (108 రకాల వంటకాలు) అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు. 17వ తేదీ మధ్యాహ్నం 5 వేల మంది భక్తులకు అన్నదానం జరగనుంది.

అనాథలకు సామగ్రి వితరణ



అనాథలతో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం నిర్మల్ హృదయ్‌లో సెయింట్ జోసెఫ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఎనీడీ వెరోనిక వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం అనాథలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ చేతుల మీదుగా స్టీలు కంచాలు, గ్లాసులు, గ్లూకోస్ ప్యాకెట్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో సిస్టర్లు మేరీ, జైన్, నాన్సీ, వైస్ ప్రిన్సిపాల్ హేమ, హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె. జయలక్ష్మి, డాక్టర్ హరిణి, రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

7న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 7న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజారుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో ఈ నెల 8వ తేదీన మహా శివరాత్రి వేడుకులు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయ ఆవరణలో చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈవో రమాబాయి, ధర్మకర్తల మండలి సభ్యులు ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేడుకల సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. శివరాత్రి రోజున ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారికి కుంకుమార్చనలు జరుగుతాయని తెలిపారు. రాత్రి 7 గంటలకు లలిత సంగీత విభావరి జరుగుతుందని అన్నారు.



మహా శివరాత్రి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎరుకుమాంబ అమ్మవారి ఆలయ చైర్మన్ సర్వేశ్వరరెడ్డి తదితరులు

ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం కావాలి



జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ : జీవీఎంసీ జోన్–4 పరిధిలో రెవెన్యూ వసూళ్లు వేగవంతం కావాలని జోనల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. జోన్‌లోని 12వ వార్డుల్లో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, దుకాణాల రెన్యువల్స్, ట్రేడ్ లైసెన్సుల రెన్యువల్స్ చేసుకోవాలన్నారు. సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో సౌకర్యం సెంటర్‌లో ప్రజలే స్వయంగా వచ్చి చెల్లించాలన్నారు. అదే విధంగా రెవెన్యూ అధికారులతో పాటు రెవెన్యూ సెక్రటరీలు బృందంగా ఏర్పడి త్వరితగతిన పన్నులు వసూలు చేయాలన్నారు. మార్చి నెలఖారు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మొండి బకాయిలకు ముందుగా నోటీసులు ఇవ్వాలన్నారు. అప్పటికీ చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పన్నుల వసూళ్లు చెక్ రూపంలో తీసుకోకూడదన్నా రు. డీడీల రూపంలో తీసకుని సౌకర్యం సెంటర్‌లో చెల్లించాలన్నారు. వసూళ్లలో జోన్–4 కార్యాలయం ముందు వరుసలో ఉండాలని ప్రసాదరావు అన్నారు.

35వ వార్డులో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమం ఇన్‌చార్జి అలపన కనక రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో కనకరెడ్డి మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్లీ గెలిపించుకోవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇప్పటికీ దక్షిణ నియోజకవర్గంలో టీడీపీకి అభ్యర్థి లేరన్నారు. ఈ ఎన్నికలతో ప్రతిపక్షానికి పూర్తిగా అభ్యర్థులు లేకుండా చేయాలన్నారు. ఒక్కొక్క బూత్‌కి ఇన్‌చార్జితో పాటు ముగ్గురు వైస్ ప్రెసిడెంట్లు, ముగ్గురు గృహసారథులు ఉంటారన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో వార్డుల ముఖ్య నేతలు ఆదివిష్ణురెడ్డి, వాసర్ల సుబ్రహ్మణ్యం, బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న 35వ వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి

తూర్పు కాపులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర జిల్లాల్లో తూర్పు కాపులు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు తూర్పు కాపులకే అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో దాదాపు 17 నియోజకవర్గాల్లో తూర్పు కాపులు అధికంగా ఉన్నారని తెలిపారు. పెందుర్తి, అనకాపల్లి, భీమిలి, చోడవరం, మాడుగుల, విజయనగరం జిల్లా తదితర ప్రాంతాలను తూర్పు కాపులకు కేటాయించాలన్నారు. ఉత్తరాంధ్రేతర కాపులు తూర్పు కాపు నియోజకవర్గాల్లో తూర్పు కాపులుగా చలామణీ అవుతూ తమను దోచుకోవడమే కాక, తమ రిజర్వేషన్లు కూడా దోచుకుని దర్జాగా తిరుగుతున్నారని ఆరోపించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి వెంకట రమణమూర్తి, లోగిన గణేష్, కేఎల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'దివ్యాంగులకు ఏం మేలు చేస్తారో తెలపాలి'

దాబాగార్డెన్స్ : దివ్యాంగుల అంశాలు అన్ని రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోల్లో పెట్టాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమావేశంలో పలువురు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 25 లక్షల మంది వికలాంగులు అనేక ఇబ్బందుల్లో ఉన్నారని, వికలాంగుల చట్టం–2016 అమలు కాకపోగా, భద్రత కరువైందని, సంక్షేమ పథకాల్లో కూడా కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా మంగళవారం ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ముందుగా అన్ని రాజకీయ పార్టీలు వికలాంగుల సమస్యల పరిష్కారానికి రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. అడివయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. వికలాంగుల చట్టాన్ని, పథకాలను నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. అర్హులందరికీ ఎటువంటి నియమ నిబంధనలు పెట్టకుండా మోటారు వాహనాలు, ఇతర ఉపకరణాలు అందజేయాలన్నారు. అన్ని రకాల బస్సు సర్వీసుల్లో వికలాంగులు ఉచితంగా ప్రయాణించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరు అప్పలనాయుడు, బి. నూకప్పారావు, పాల వెంకయ్య, జి. వెంకటరమణ, బాలకృష్ణ, శ్రీనివాస్, వరలక్ష్మి, వి. దుర్గ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకుంటున్న అభ్యర్థులు



జాబ్‌మేళాను ఉద్దేశించి మాట్లాడుతున్న కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మి



నియామక పత్రాలతో ఎంపికైన అభ్యర్థులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ), నోడల్ రీసోర్స్ సెంటర్ (ఎన్‌ఆర్‌సీ), ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో పాటు యలమంచిలి, పాడేరు, నక్కపల్లి, నర్సీపట్నం, మాడుగుల నుంచే కాక విశాఖ జిల్లాలో గల వివిధ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సుమారు 1630 మంది పాల్గొన్నారు. జాబ్‌మేళాలో అరబిందో, యకోమా, గ్రీన్‌టెక్, సినర్జీస్, ఇన్నోవ్‌సోర్స్, డబ్ల్యూఎన్ఎస్, వెంచూర్ ఆఫ్‌షోర్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, డెక్కన్ ఫైన్ కెమికల్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. 280 మందిని ఎంపిక చేసినట్టు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వై. లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ కో ఆర్డినేటర్ అరుణపద్మ, ఎన్‌ఆర్‌సీ కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీష, జేకేసీ మెంటార్ ఎంఎస్ ప్రజ్ఞ, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దహన ఖర్చులకు ఆర్థిక సాయం



ధనరాజు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి సూర్య

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 38వ వార్డు బుక్కావీధికి చెందిన పార్టీ నాయకుడు (మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అనుచరుడు) పాలమరెశెట్టి ధనరాజు ఛాతీనొప్పితో సోమవారం అకాల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వాసుపల్లి గణేష్ కుమార్ అందుబాటులో లేకపోవడంతో తన కుమారుడు వాసుపల్లి సూర్యతో రూ.10 వేలు దహన ఖర్చుల కోసం ధనరాజు కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేయించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూలో నీటి ఏనుగుల సందడి





జూ ఎన్‌క్లోజర్‌లో కలియదిరుగుతున్న నీటి ఏనుగులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో నీటి ఏనుగులు సందడి చేస్తున్నాయి. సీతాకోక చిలుకల పార్కుల ఎదురుగా నీటి ఏనుగుల ఎన్‌క్లోజరు ఉంది. దానిలో రెండు నీటి ఏనుగులు ఉన్నాయి. ఆ రెండూ తల్లీపిల్ల కావడం విశేషం. తల్లి నీటి ఏనుగు పద్మ, పిల్ల నీటి ఏనుగు జూనియర్ దలపతి రెండూ కలియ తిరుగుతూ సందర్శకులను అలరిస్తున్నాయి. సాధారణంగా ఇవి నీటిలోనే ఎక్కువ సమయం గడుపుతాయి. సందర్శకులకు వాటి తల భాగం మాత్రమే బయటకు కనిపిస్తుంది. యానిమల్ కీపర్ ఆహారం వేసిన సమయంలో రెండూ ఒడ్డుకు చేరుకుని ఆహారం తింటాయి. మళ్లీ నీటిలోకి వెంటనే వెళ్లిపోతాయి.

సహకార బ్యాంకులతోనే సుస్థిర అభివృద్ధి



ఆచార్య బాలమోహన్‌దాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: సహకార బ్యాంకులతోనే దేశ సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ అన్నారు. కనకమహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ రజతోత్సవాలను బ్యాంకు ఎంవీపీ కాలనీ శాఖలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆచార్య బాలమోహన్‌దాస్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సహకార బ్యాంకులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముఖగా నిలుస్తున్నాయన్నారు. ఒక పక్క వినియోగదారులకు సేవలు అందిస్తూనే దేశ ఆదాయానికి సహకారం అందిస్తున్నాయన్నారు. ఖాతాదారులకు కనకమహాలక్ష్మి బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ ఖాతాదారులకు సులభతరమైన సేవలు అందిస్తున్నారన్నారు. బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు మాట్లాడుతూ ఖాతాదారుల ఆదరణతో బ్యాంకు 24 ఏళ్లు పూర్తి చేసుకొని 25వ ఏట అడుగుపెట్టిందన్నారు. విశాఖలో 28 శాఖలుగా ఖాతాదారులకు విలువైన, నమ్మకమైన సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం బ్యాంకు ప్రతినిధులు ముఖ్యఅతిథి ఆచార్య బాలమోహన్‌దాస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పట్టాభిరామ్, బ్యాంకు డైరెక్టర్లు బి.నాగేశ్వరరావు, జి.రామకృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం



హనుమంతవాక వద్ద భగవద్గీత ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధకులు

ఆరిలోవ: మహా శివరాత్రిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి–ఇందూ జ్ఞాన వేదిక విశాఖ పట్నం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీత ప్రచారం చేపట్టారు. ఈ నెల 8న మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా త్రైత సిద్ధాంతం ప్రబోధకులు హనుమంతవాక ప్రాంతంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల సారం గురించి ప్రచారం చేశారు. మహా శివరాత్రి పూజలు, జాగరణ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి విశాఖ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ పుష్కరరావు, రణ, అప్పారావు, మంగ అరుణ్, విజయ్, రమ, పద్మాదేవి పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ

బీచ్ రోడ్డు: రజక సేవా సమైక్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ 16వ వార్డులోని ఇసుక తోటలో బల్లల పండగ ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొల్లంగి నాగేశ్వరరావు, సంఘం అధ్యక్షులు అప్పారావు, కార్యదర్శి మడక ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అక్షయ పాత్ర'లో గ్యాస్ బాయిలర్ ఏర్పాటు

కంచరపాలెం: కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో నాణ్యమైన ఆహార పదార్థాల సరఫరాలో పేరుపొందిన అక్షయ పాత్ర ఫౌండేషన్ నూతన ఆవిష్కరణకు శ్రీకారం చుట్టిందని (టీఏపీఎఫ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్టేట్ హెడ్ బి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని అక్షయ పాత్ర ఫౌండేషన్ యూనిట్‌లో ఇండియన్ ఆయిల్ సౌజన్యంతో రూ.20లక్షలతో ఏర్పాటు చేసిన గ్యాస్ బాయిలర్‌లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ 850 కిలోల సామర్థ్యంతో గ్యాస్ బాయిలర్‌ను ఏర్పాటు చేశామని, కంచరపాలెం శాఖ కేంద్రంగా ప్రతి రోజు 137 పాఠశాలకు సుమారు 30వేల మంది విద్యార్థులకు (జగనన్న గోరుముద్ద) మధ్యాహ్న భోజన పథకం ద్వారా భోజనం అందించడంతో ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం వంటశాల పరికరాలు పరిశీలించారు.